# చీకటిలో చిరునవ్వు




ఇది నిజమా? ఆయన మాటలు నామె స్పష్టంగా వింది. ఇంకా వింటూంది. "ఇక చూడ్డానికేమీ లేదు. మీకు ఆస్తి ఉందా, లేదా అన్న వివరాలు నాకు అక్కర్లేదు. మీకు డబ్బులేక పోయినా నా కేమీ అభ్యంతరం లేదు. నాకు నచ్చింది అమ్మాయి. అమ్మాయి లక్షణంగా ఉందా? లేదా? — అంతే నాకు కావాలి" అంటున్నా డాయన.

కిటికీలోంచి చూసింది జయలక్ష్మి. దబ్బపండు ఛాయతో తిరిగిన్నాయన. ముఖం మీది చర్మం ముడతలు పడుతూంది. అరమోడ్పు కళ్ళతో ఏవో స్వప్న లోకాలలో విహరిస్తున్నట్టున్నారు. కోటు జేబులోంచి ఒక ఫోటో తీసి, "ఇది మా అమ్మాయి ఫోటో. ఆలోచించుకుని మీరే ఉత్తరం రాయండి" అని ఫోటో బల్ల మీద పెట్టి, వెనక్కి తిరిగి చూడకుండా వీధిలోకి వెడలాడు సీతాపతి.

క్షణాలమీద ఈ వార్త జయలక్ష్మి బంధువర్గంలో వ్యాపించింది. స్నేహితురాళ్ళందరికీ తెలిసిపోయింది. జయలక్ష్మి అదృష్టాన్ని కొందరు మనస్ఫూర్తిగా ప్రశంసించారు. కొందరు పైకి మెచ్చుకున్నా, లోపల అసూయపడ్డారు. కట్నమూ కానుకలూ లేకుండా, డబ్బుతో ప్రమేయం లేకుండా, కేవలం పిల్ల అందం, శుభ లక్షణాలు, సంప్రదాయం

చూసి పెళ్లికి ఒప్పుకుంటున్నారు. పెళ్లి కొడుకు సామాన్యుడయితే విశేషమే లేదు. బి. ఇ. పాసయ్యాడు. ఎక్కడో దూర దేశంలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు చదువుతున్నాడు. నేడో రేపో గొప్ప ఇంజనీరు కావలసినవాడు.

జయకు తన చుట్టూ ఉన్న ప్రపంచం నందనవనంలా కనిపించింది. వికసించిన పువ్వులలోను, వెన్నెలలోను, విరిగిపడే సముద్ర తరంగాల గలగలలోను, నీలాకాశంలోను ఆమెకు ఇప్పుడు అందం కనిపిస్తూంది. ఆమె కన్నె మనసు ఊహా తరంగాల మీద ఉయ్యాల లూగుతూంది.

నిరుపేద ఇంట్లో పుట్టి పెరిగింది జయ. జయకు ధనవంతుల లోకం మీద వ్యామోహం ఉంది. తమది మధ్య తరగతి కుటుంబం అయినప్పటికీ ఆమె దృష్టిలో తాము నిరుపేదల క్రిందే లెక్క. తనకు ఊహ తెలిసింది మొదలు నేటివరకూ తండ్రి అప్పులతో బాధ పడుతున్నాడు. అన్ని కష్టాలలోను తనను చదివించటమే తండ్రి చేసిన గొప్పపని. తను ఎక్కడా తప్పకుండా పరీక్ష పాసు అవడం కూడా అందుకు ఒక కారణం. చదువుకుంటే మంచి సంబంధం దొరుకుతుందేమో అని తండ్రి ఆశ.

ఆమె రూపం యువక హృదయాలలో తీయని తలపులు రేకెత్తించింది. ఆమెకు కొన్ని ప్రేమ లేఖలూ వచ్చాయి. కానీ, పెళ్లి సంబంధాలు మాత్రం రాలేదు. అందుకు కారణం ఆమెకు తెలుసు.

అలాంటి సమయంలో సీతాపతిగారి సంబంధం తీసుకు వచ్చాడు సోమసుందరం. తన తమ్ముడు తెచ్చిన సంబంధం చూసి జయ తల్లి మురిసిపోయింది. జయ తండ్రికి ఇదంతా అయోమయంగా ఉంది. ఎవరికి ఎలా ఉన్నా, జయకు చాలా సంతోషంగా ఉంది. తన అపురూప సౌందర్యంతో మహర్షిని జయించిన ఊర్వశిలా విజయగర్వం తొణికిస లాడుతూందామెలో! ఆమె అందం మీద ఆమెకు చాలా నమ్మకం ఉంది.

సీతాపతిని సాగనంపి తిరిగి వచ్చిన తరవాత సోమసుందరం మీద ఇంటిల్లిపాదీ ప్రశ్నల వర్షం కురిపించారు. సోమసుందరం చెప్పుకున్న జవాబుల సారాంశం:

సీతాపతి గారికి ఒక్కడే కొడుకు. అతని అసలు పేరు రాజేశ్వరరావు. ముద్దు పేరు రాజా. తల్లిదండ్రులు ఇద్దరూ కొడుకును అతి గారాబంతో పెంచారు. సాధారణంగా ఒక్కడే కొడుకు ఉన్నప్పుడూ, గారం ఎక్కువైనప్పుడూ కుర్ర వాడు చెడిపోతూ ఉండడం రివాజు. ఇక్కడమాత్రం అలా జరగలేదు.



కళావాహిని ఆధ్వర్యంలో జరిగిన లలిత సంగీత కచేరీలో పాడిన శ్రీ ఆనంద్. శ్రీ ప్రవీణ్ కుమార్, కుమారి జ్యోతి

కుర్రవాడు చాలా బుద్ధిమంతుడు. బాగా తెలివైన వాడు. ఒక్కడే కొడుకు కావడం వల్ల రాజా చదువు పట్ల సీతాపతి ఎక్కువ శ్రద్ధ తీసుకున్నాడు. ప్రతి పరీక్ష ఫస్టు క్లాసులో పాసవుతూ వచ్చాడు రాజా. తమ ఆశలూ, కోరికలూ అన్నీ తమ ఏకైక పుత్రుడి మీదే కేంద్రీకరించుకున్నారు తల్లిదండ్రులు. రాజా అభివృద్ధికోసం తమ యావదాస్తీ ఖర్చు పెట్టడానికి వాళ్లు వెనకాడలేదు. ఆస్తి అంటే ఒక పెద్ద తోటా, ఒక ఇల్లూ వగైరా ఏభైవేల వరకూ ఉంటుంది. పైగా సీతాపతిగారికి నెలకు ఐదువందల రూపాయలు జీతం వస్తుంది.

కొడుకును దూరంగా ఒంటరిగా విడిచి పెట్టవలసిన అవసరం ఆ దంపతులకు కలగలేదు. పట్నంలో ఇంజనీరింగు కాలేజీలో రాజా చేరినప్పుడు సీతాపతికి కూడా పట్నం బదిలీ అయింది. అప్పుడే సోమసుందరానికి సీతాపతితో పరిచయం అయింది.

ఆరేళ్ల తరవాత ఈవేళే సోమసుందరం సీతాపతిగారిని తిరిగి కలుసుకోవడం తటస్థించింది. సోమసుందరానికి ఈ ఆరేళ్ల లోను సీతాపతిలో చాలా మార్పు కనిపించింది. మనిషిలో సరాకు ఎక్కువయింది. ఒక మాటలోంచి మరో మాట చెబుతున్నాడు. ఇద్దరూ కలుసుకున్న తరవాత కుశల ప్రశ్నలలో రాజా ప్రస్తావన వచ్చింది.

రాజా ఇంజనీరింగు కోర్సు పూర్తి చేశాడట. సుందరమ్మకు ఇష్టంలేక పోయినా తను సాహసించి కొడుకును పై చదువుకు పొరుగు రాష్ట్రానికి పంపాడట. ఇక రెండు నెలల్లో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు పూర్తి అవుతుందట.

"ఇక లక్షణమైన పిల్లను చూసి పెళ్లిచెయ్యడం, తరవాత వాణ్ణి మంచి ఉద్యోగంలో వేయించడం — ఈ రెండు పనులూ పూర్తి అయితే చాలు, నా బాధ్యత తీరిపోతుంది. అప్పుడు నేను రిటైరయి పోయి ఏకంగా విశ్రాంతి తీసుకోవచ్చు" అని సీతాపతే పెళ్లి ప్రస్తావన ముందు తీసుకురావడం, "అయితే, ఈ ఊళ్లోనే ఒక సంబంధం ఉంది. మీరు చూస్తారా?" అని సోమసుందరం అడగడం, అతని మాట కాదనలేక సీతాపతి రావడం, జయలక్ష్మి అతనికి నచ్చటం ఒక దాని వెంట ఒకటి జరిగిపోయాయి.

"నీ చేతుల మీదే పెళ్లి కూడా స్థిరపరుచు" అని తమ్ముణ్ణి అడిగింది జయ తల్లి.

"ఇక రెండు నెలల్లో పెళ్లికొడుకు చదువు పూర్తిచేసుకొని వస్తాడు. అప్పటి వరకూ మనం ఆగాలి. అతను వచ్చిన వెంటనే ముహూర్తం నిశ్చయించుకో వచ్చు" అన్నాడు సోమసుందరం.

రెండు నెలలంటే కొందరికి రెండు క్షణాలుగా గడిచిపోవచ్చు. కాని, జయ తల్లికి రెండు నెలలూ రెండు యుగాలుగా కనపడ్డాయి.

అందరూ ఎవరి పనులలోకి వాళ్ళు వెళ్లిపోయిన తరవాత జయ నెమ్మదిగా గదిలోకి వెళ్లింది. టేబులు మీద ఉన్న ఫోటో తీసి చూసింది. పెళ్లికొడుకు సినిమా హీరోలా గొప్ప అందగాడు కాకపోయినా, కురూపిమాత్రం కాడు. ఫోటోను చూసి అందం నిర్ణయించడం కష్టం. ఎంతో అందమైన వాళ్లు కూడా ఫోటోలలో అందంగా కనిపించకపోవడం తనకు తెలుసు. ఈ అబ్బాయి ఫోటోలో కంటే అందంగా ఉండవచ్చు — అని తనను తాను సమాధాన పరుచుకొంది.

వారం రోజుల తరవాత, అతనిఫోటో అనేక పర్యాయాలు చూసిన తరవాత అతనిలో అందం, ఆకర్షణ రెండూ కనిపించాయి జయలక్ష్మికి.

రెండువారాలు గడిచేసరికి ఆ ఫోటోలో యువకుడు ఆమెకు చిరపరిచితుడులా కనిపించాడు.

రెండు నెలలూ గడిచిన వెంటనే సోమసుందరం సీతాపతికి వ్రాసిన ఉత్తరం ఇది: "మీ అబ్బాయి తిరిగి వచ్చాడా? వస్తే వెంటనే తెలియజెయ్యండి. లాంఛన ప్రాయంగా పెళ్లి చూపులు పూర్తయిన వెంటనే ముహూర్తం నిశ్చయించుకో వచ్చు."

అసలే సీతాపతి బద్ధకస్తుడు. వెంటనే అతను జవాబు వ్రాయకపోతే తన అక్క ఊరుకోదు. అందుకోసం స్వయంగా వెళ్లి చూసి దగ్గర ఉండి సమాధానం వ్రాయించమని అతను ఆ ఊళ్లోనే ఉన్న ఒక స్నేహితుడికి కూడ ఉత్తరం వ్రాశాడు. తిరుగు టపాలో స్నేహితుడి దగ్గిరి నుంచి మూర్ఛ! జవాబు వచ్చింది సోమసుందరానికి.

**అంగర కృష్ణారావు**

అందులో — "సీతాపతి గారికి అలాంటి ఉత్తరం వ్రాశావేమిటి? తెలిసి వ్రాశావా? తెలియక వ్రాశావా? నీ ఉత్తరం చదివిన వెంటనే సీతాపతి గారి భార్య సముద్రంలో పడడానికి వెళ్ళింది. పొరుగు వాళ్ళు ఆమెను పట్టుకొని ఆపుచేసి ఇంటికి తీసుకు వచ్చారు" అని ఉంది.

ఆ ఉత్తరం చదవగానే అందరి మీదా ఒక్కసారే పిడుగు పడినట్లయింది.

పెళ్ళికొడుకు తండ్రికి పిల్ల నచ్చిందని అందరూ సంతోషించారు. పెళ్ళికొడుక్కి తప్పకుండా నచ్చుతుందనీ నమ్మారు. కానీ, పెళ్ళికొడుకు తల్లి అభ్యంతరం చెబుతుందని ఎవరూ ఊహించలేదు. ఆవిడ దృష్టిలో మరేదైనా పెద్ద సంబంధం ఉందేమో?

"నాకు తెలిసినంతవరకూ సుందరమ్మ భర్త మాటకు ఎదురు చెప్పదు. సీతాపతిగారికి పిల్ల నచ్చిన తరవాత కూడా ఆవిడ అభ్యంతరం చెప్పిందంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. నేను స్వయంగా వెళ్ళి వివరాలు తెలుసుకు వస్తాను. మీరు తొందరపడకండి. సీతాపతిగారు మాట తప్పే మనిషి కాదు."

అక్కగారికి ధైర్యం చెప్పి సోమసుందరం బయలుదేరాడు. సాయంత్రానికి ఆ ఊరు చేరుకున్నాడు. సరాసరి సీతాపతి గారి ఇంటికి వెళ్ళి ఆయన మీద [illegible] కంటే ముందు తన స్నేహితుడి ఇంటికి వెళ్ళి, అతని సలహా తీసుకోవడం మంచిదనుకున్నాడు. అలాగే వెళ్ళాడు. అతని స్నేహితుడూ, ఇతరులూ చెప్పిన వివరాలన్నీ తెలుసుకున్నాడు. ఆగిపొమ్మని స్నేహితుడెంత చెప్పినా వినకుండా ఆ రాత్రికి రాత్రే తిరుగు ప్రయాణమయ్యాడు.

దట్టమైన చీకటిలో విశ్వాన్ని చీల్చుకుంటూ ఒక్కొక్క మెట్టే ఎక్కుతున్న సోమసుందరానికి ఆ ఇంటిలో నిద్ర పట్టని ముగ్గురు వ్యక్తులలో ఇద్దరు ఆత్రంతో లేచి ఎదురు వెళ్ళారు. జయమాత్రం మంచం మీది నుంచి లేవలేదు. ఆమె కిటికీలోంచి శూన్యంలోకి చూస్తోంది.



సోమసుందరం తాను తెలుసుకున్న వివరాలన్నీ వరసగా చెప్పలేకపోయాడు. కానీ, అతను తెలుసుకున్న సంగతులు ఇవి:

సుందరమ్మ కొడుకును ఒక్క రోజైనా విడిచిపెట్టి ఎప్పుడూ ఉండలేదు. పై చదువు మీద తండ్రీకొడుకు లిద్దరికీ మోజు ఉంది. భార్య వద్దని ఎంత చెప్పినా సీతాపతి వినలేదు. విపరీతమైన ప్రేమతో కుర్రవాడి భవిష్యత్తు పాడుచెయ్యటం మంచిది కాదని ఆవిడకు నచ్చచెప్పాడు.

"వాడు తప్ప మనకు కావలసిందేముంది ప్రపంచంలో? మన సంపద యావత్తూ వాడికోసం ఖర్చుపెట్టి వాణ్ణి గొప్పవాణ్ణి చెయ్యడమే మన కర్తవ్యం. ఇక మారుమాటాడకుండా సంతోషంతో సాగనంపు" అన్నాడు. ఆ ఇల్లాలు అలాగే దీవించి పంపింది. ఎడబాటుకు కొద్ది కొద్దిగా అలవాటు పడుతూంది ఆమె.

భార్యాభర్తలిద్దరూ వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకున్నా, పైవాళ్ళతో మాట్లాడినా రాజు ప్రస్తావన రాకుండా ఉండేది కాదు. ఆ దంపతులిద్దరూ తమ ఆశలను, కోరికలను రాజు మీదే కేంద్రీకరించుకొని, అతని రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఆరు నెలలకు ఒకసారి వస్తున్నాడు, వెళుతున్నాడు. అలాగ మూడుసార్లు వచ్చి వెళ్ళాడు. చదువు పూర్తి చేసుకు రావడానికి ఇక ఆరు నెలలు మాత్రమే గడువు ఉంది. సుందరమ్మ రోజులు లెక్క పెడుతూంది.

ఆ రోజుల్లోనే రెండు పెళ్ళి సంబంధాలు కూడా వచ్చాయి. కానీ, సీతాపతి ఏదో వంకపెట్టి రెండు సంబంధాలను పంపేశాడు. సీతాపతి దృష్టి కొడుకు పెళ్ళి మీద లేదు. పై చదువుల మీదే ఉంది. రాకెట్ వేగంతో ఎంత కష్టమైన కోర్సు అయినా సునాయాసంగా పూర్తిచేస్తూ వెళుతున్న కొడుకు కాళ్ళకు బంధం వెయ్యడం అతనికి ఇష్టం లేదు.

భార్యాభర్తలిద్దరూ ఎవరి ఊహా ప్రపంచంలో వాళ్ళు విహరిస్తున్న సమయంలో ఒక టెలిగ్రాం వచ్చింది.

టెలిగ్రాం చూడగానే సీతాపతి పిచ్చివాడిలా చకచకా పెట్టె సర్దుకొని భార్యను తీసుకొని రాత్రి ట్రెయిన్‌లో బయలుదేరాడు.

స్టేషనుకు కొందరు విద్యార్థులు వచ్చారు. సీతాపతినీ, సుందరమ్మనూ సరాసరి హాస్పిటలుకు తీసుకు వెళ్ళారు.

టెలిగ్రాం వార్తతో [illegible] మైన మానసిక వ్యథతో ఉన్నప్పటికీ పడుకొని ఉన్న తమ ఏకైక పుత్రుడు రాజు అక్కడ కనిపించలేదు. గుర్తుపట్టడానికి కూడా వీలులేని అతని మృత కళేబరం కనిపించింది.

ఆ సంఘటనకు [illegible] చేశారో, [illegible] ఇంజక్షన్లు ఇచ్చారో, మరేం చేశారో తెలియదు. స్పృహలేని స్థితిలో వాళ్ళిద్దర్నీ స్వగ్రామం చేర్చడం జరిగింది.

స్పృహ రాగానే సీతాపతికి చుట్టూ దట్టమైన చీకటి ఆవరించుకొని ఉంది. ఆ చీకటిలో చిరపరిచితమైన చిరునవ్వు కనిపించింది. భరించలేకపోయాడు. వర్తమాన భవిష్యత్కాలాలు ఆగిపోయాయి. గతం ఒక్కటే కనిపిస్తోంది. ఇప్పుడు అతని దృష్టిలో అతని కొడుకు సజీవుడు.

"మా వాణ్ణి అమెరికా పంపిస్తాను. ఈ సారి ఒంటరిగా పంపను. లక్షణమైన పిల్లను చూసి పెళ్ళిచేసి పంపుతాను" అని నలుగురితోనూ చెబుతున్నాడు.

* * *

జయలక్ష్మి కల కరిగిపోయింది. చీకటి ఆవరించిన ఆమె బ్రతుకు బాటలో అదృష్టం మెరుపులా మెరిసి మాయమయింది. ★